# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక


మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/









## ఆయిల్ కంపెనీ ప్రతినిధులతో అధికారుల వరుస సమావేశాలు

**పెట్రోల్, డీజిల్ కొరతపై చంద్రబాబు నిరంతర పర్యవేక్షణ...**

- ఏపీలో మెరుగుపడుతున్న పరిస్థితులు
- క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు సీఎంకు నివేదించిన అధికారులు
- 11,909 కిలోలీటర్ల పెట్రోల్, 19,707 కిలోలీటర్ల డీజిల్ సరఫరా చేసిన ఆయిల్ కంపెనీలు
- రాత్రిళ్లు కూడా లోడ్ డిస్పాచ్ జరపాలని ముఖ్యమంత్రి ఆదేశం

సాధారణ పరిస్థితులు నెలకొనేంత వరకు ఆర్టీజీఎస్ నుంచి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశం రాష్ట్రంలో ఏర్పడిన పెట్రోల్, డీజిల్ కొరతపై నిరంతరం పర్యవేక్షిస్తూనే ఉండాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన ముఖ్యమంత్రి, విశాఖకు బయలుదేరే ముందు మరోసారి పరిస్థితిపై సమీక్షించారు.అలాగే విశాఖ నుంచి మరోసారి టెలి కాన్ఫరెన్స్ చేపట్టారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ సమస్య సాధారణస్థితికి



## ఇంధన కొరత ఏర్పడినందుకు చంద్రబాబు సిగ్గుపడాలి: షర్మిల

- సమీక్షలు, సలహాలతో ఇంధన కొరత తీరదన్న షర్మిల
- రాష్ట్రంలో 70 శాతం బంకులు మూతపడ్డాయని వ్యాఖ్య
- కూటమి ప్రభుత్వ పాలనా వైఫల్యమని ఆరోపణ

## బీఆర్ఎస్ ఓ 'చచ్చిన శవం'..

- కవిత పార్టీ అవసరమే లేదు: రేవంత్ రెడ్డి
- చచ్చిన శవానికి ఎంత అలంకరణ చేసినా వేస్ట్ అన్న రేవంత్
- రాష్ట్రంలో కొత్త పార్టీ అవసరమే లేదని వ్యాఖ్య
- బీఆర్ఎస్ ఉంటుందో, ఊడుతుందో అని ఎద్దేవా



కొత్త ఎమ్మెల్సీలుగా అజారుద్దీన్, కోదండరాం ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణస్వీకారం అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ పార్టీ చచ్చిపోయిందని ఆయన అన్నారు. "చనిపోయిన శవానికి ఎంత అలంకరణ చేసినా ప్రయోజనం ఉండదు.. బీఆర్ఎస్ పరిస్థితి కూడా ఇప్పుడు అలాగే ఉంది" అంటూ విరుచుకుపడ్డారు. పదేళ్ల అహంకార పూరిత పాలన వల్లే ప్రజలు ఆ పార్టీని తిరస్కరించారని, దాని మనుగడే ప్రశ్నార్థకమైందని వ్యాఖ్యానించారు.



## ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం

- ప్రమాణం చేయించిన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి
- కోదండరాం, అజారుద్దీన్‌లను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- ముస్లింల ఓట్ల కోసం తనకు మంత్రి పదవి ఇచ్చారనే వాదనలో వాస్తవం లేదన్న అజారుద్దీన్

ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోదండరామ్, అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేశారు. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు హాజరయ్యారు. గవర్నర్ కోటాలో కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్‌లను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది.



## కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలి: మహేశ్ కుమార్ గౌడ్

- బీజేపీ తెలంగాణలో సెక్యులర్ ఓట్లను తొలగించేందుకు కుట్ర చేస్తుందని విమర్శ
- రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం అనే రెండు చక్రాలపై ప్రజాపాలన సాగుతోందన్న టీపీసీసీ చీఫ్
- వచ్చేసారి 2023 ఎన్నికల ఫలితాలు రిపీట్ కావాలని ఆకాంక్ష


## దక్షిణ కోట ఎవరికి దక్కేను?

- పశ్చిమబెంగాల్ దక్షిణ ప్రాంతంలో కీలకంగా మారిన 91 సీట్లు
- 24 పరగణాలు, కోల్‌కతా, హౌరాలపై కన్నేసిన కీలక పార్టీలు



కోల్‌కతా: పశ్చిమబెంగాల్ ఎన్నికల చదరంగంలో గెలుపు పావులను ఉత్తరబెంగాల్ కొండ ప్రాంతాలు, జంగల్‌మహల్ అటవీప్రాంతాల్లో కాకుండా





## నాలాంటి వాళ్లకు ఇదొక ఎమోషన్

- ఆంధ్రా యూనివర్సిటీ ఒక సంస్థ మాత్రమే కాదు.. ఒక ఎమోషన్ అన్న మంత్రి నారా లోకేష్
- దేశంలోనే ఏయూకు ఓవరాల్‌గా 3వ ర్యాంక్ సాధించడమే లక్ష్యం
- ఏడాదిలోగా యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న పోస్టుల

## మహారాష్ట్రలో పట్టాలు తప్పిన వందేభారత్ రైలు

**పుణే వద్ద పట్టాలు తప్పిన ముంబై–షోలాపూర్ వందేభారత్**

- ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదని వెల్లడి
- స్టేషన్ వద్ద డైమండ్ క్రాసింగ్ వద్ద జరిగిన ఘటన
- ప్రయాణికులను మరో రైలుకు తరలించేందుకు ఏర్పాట్లు
- ఇలాంటి క్రాసింగ్‌లను భర్తీ చేస్తామన్న రైల్వే అధికారులు






జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

## మహారాష్ట్రలో పట్టాలు తప్పిన వందేభారత్ రైలు

(మొదటి పేజీ తరువాయి)

ముంబై నుంచి షోలాపూర్ వెళుతున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ పుణే సమీపంలో పట్టాలు తప్పింది. సోమవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనలో ప్రయాణికులెవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. సెంట్రల్ రైల్వే చీఫ్ పీఆర్‌ఓ డాక్టర్ స్వప్నిల్ నీలా తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం సాయంత్రం 7:30 గంటల సమయంలో రైలు పుణే స్టేషన్‌లోకి ప్రవేశిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్లాట్‌ఫాంకు సమీపంలోని డైమండ్ క్రాసింగ్ వద్ద రైలు నాలుగో కోచ్‌కు చెందిన ఒక ట్రాలీ (చక్రాల భాగం) పట్టాలు తప్పింది. రైలు ఒక ట్రాక్ పై నుంచి మరో ట్రాక్ కు మారే మార్గాన్ని'డైమండ్ క్రాసింగ్' అంటారు.పుణే స్టేషన్ యార్డు ఆధునికీకరణ పనుల్లో భాగంగా ఈ డైమండ్ క్రాసింగ్‌ను అప్‌గ్రేడ్ చేయాలని ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశామని స్వప్నిల్ నీలా వివరించారు. "ప్రయాణికులను మరో రైలుకు మార్చే ఏర్పాట్లు చేస్తున్నాం. దేశవ్యాప్తంగా ఉన్న ఇలాంటి పాతతరం నాన్-స్టాండర్డ్ డైమండ్ క్రాసింగ్‌లన్నింటినీ ప్రాధాన్యత క్రమంలో భర్తీ చేస్తాం" అని ఆయన స్పష్టం చేశారు.ప్రమాదం జరిగిన వెంటనే, పట్టాలు తప్పిన కోచ్‌లోని ప్రయాణికులు తమ లగేజీతో కిందకు దిగి ప్లాట్‌ఫాం వైపు నడుచుకుంటూ వెళ్లారు. రైల్వే అధికారులు వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు మరో రైలును ఏర్పాటు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ ఘటనతో మహారాష్ట్రలో నడుస్తున్న వందే భారత్ సర్వీసులపై స్వల్ప ప్రభావం పడే అవకాశం ఉంది.

## కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలి: మహేశ కుమార్ గౌడ్

(మొదటి పేజీ తరువాయి)

రాబోయే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని, రాహుల్ గాంధీని ప్రధానిగా చేయడమే ప్రతి కార్యకర్త ధ్యేయం కావాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. బీజేపీ తన కుటిల యత్నాల్లో భాగంగా తెలంగాణలో సెక్యులర్ ఓట్లను తొలగించేందుకు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, అడ్డదారుల్లో ఓట్లను తొలగించే కుట్రను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.బూత్ లెవల్ ఏజెంట్ నియామకం, పనితీరు విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకూడదని అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్ఠత కోసం బూత్ లెవల్ ఏజెంట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం అనే రెండు చక్రాలపై ప్రజాపాలన సాగుతోందని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో లేని సంక్షేమ పథకాలు మన వద్ద అమలవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, ఇది సాధారణ విషయం కాదని పేర్కొన్నారు. ఇది ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. వచ్చేసారి 2023 ఎన్నికల ఫలితాలు మళ్లీ రిపీట్ కావాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో అత్యధిక పార్లమెంట్, అసెంబ్లీ స్థానాలు గెలవడమే తమ లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. త్వరలో కార్పొరేషన్ పదవుల భర్తీ ఉంటుందని హామీ ఇచ్చారు. నాయకులు తమ సమయంలో 80 శాతాన్ని పార్టీ కోసం కేటాయించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్ఠంగా ఉంటేనే భవిష్యత్తు విజయాలు సాధ్యమవుతాయని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.

## దక్షిణ కోట ఎవరికి దక్కేను?

(మొదటి పేజీ తరువాయి)

దక్షిణబెంగాల్ మైదానప్రాంతాల్లోనే కీలక పార్టీలు మోహరిస్తుంటాయి. ఈసారి కూడా అదే ఆట మొదలైంది. జంట జిల్లాలైన ఉత్తర, దక్షిణ 24 పరగణాల్లో, కోల్‌కతా, హౌరా ప్రాంతాల్లో గెలుపు అనేది అధికారపీఠానికి రాచబాటగా చెబుతుంటారు. గత ఎన్నికల్లో ఈ ప్రాంతాలపై తృణమూల్‌కాంగ్రెస్ గెలుపు జెండా ఎగరేయగా ఈసారి జెండా కిందకు దింపి కాషాయజెండా రెపరెపలాడేలా చేస్తామని కమలదళ నాయకులు కంకణం కట్టుకున్నారు. ఉత్తర 21 పరగణాల జిల్లాలో 33 సీట్లు, దక్షిణ 24 పరగణాల జిల్లాలో 31 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. రాష్ట్ర ఎన్నికల్లో ఈ రెండు జిల్లాల్లో అత్యధిక స్థానాల్లో గెలుపు అనేది అత్యంత కీలకం. కోల్‌కతా నగర పరిధిలోని 11 సీట్లు, హౌరా నగర పరిధిలోని 16 సీట్లు కూడా కలుపుకుంటే కీలక నియోజకవర్గాల సంఖ్య 91కి పెరుగుతోంది. 294 స్థానాలున్న రాష్ట్ర అసెంబ్లీలో ఇవి మూడింట ఒకవంతు స్థానాలతో సమానం. అలా ఇవి ఈసారి ఎన్నికల్లో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తున్నాయి. ఉత్తర, దక్షిణ 24 పరగణాల జిల్లాలను యావత్ రాష్ట్రంలోని కీలక జిల్లాలుగా చెబుతుంటారు. పెద్ద ప్రెసిడెన్సీ డివిజన్‌గా కొనసాగుతున్న కోల్‌కతా, హౌరా, నదియా, నార్త్, సౌత్ 24 పరగణాల్లో మొత్తంగా 111 సీట్లున్నాయి. వీటిని గెలిస్తే రాష్ట్ర సచివాలయం 'నబన్నా'లో అధికారం చక్రం తిప్పొచ్చని అటు టీఎంసీ, ఇటు బీజేపీ గట్టిగా నమ్ముతున్నాయి. ఈ 111 స్థానాలకుగాను 2021 ఎన్నికల్లో టీఎంసీ ఏకంగా 96 స్థానాలను కైవసం చేసుకుంది. ఇక్కడ బీజేపీ 14 స్థానాలతో సరిపెట్టుకుంది. ది ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్(ఐఎస్‌ఎఫ్) ఒకే ఒక్క చోట గెలిచింది. ఇంతటి కీలక దక్షిణబెంగాల్‌ను గుప్పిటపట్టకుండా అధికారాన్ని కైవసం చేసుకోవడం అసాధ్యమని రాజకీయ విశ్లేషకులు సైతం వ్యాఖ్యానించారు. అయితే 2024 లోక్‌సభ ఎన్నికలు వచ్చేనాటికి బీజేపీ బలం పుంజుకుంది. ఇక్కడి 21 సెగ్మెంట్లలో బీజేపీ హవా కొనసాగింది. నదియా, ఉత్తర 24 జిల్లాల్లో బీజేపీ, దక్షిణ 24, హౌరా, కోల్‌కతాల్లో టీఎంసీ సత్తాచాటాయి. ఇక్కడి మెజార్టీ స్థానాల్లో గెలిచి నాలుగోసారి అధికారాన్ని చేజిక్కించుకోవాలని టీఎంసీ ఉవ్విళ్లూరుతోంది. "ఇక్కడి స్థానాలను పదిలపర్చుకుంటే అధికారం మనదే. ఇవి కేవలం సీట్లు కాదు. మమతా బెనర్జీ రాజకీయ ఎత్తులకు సామాజిక వేదికలు"అని టీఎంసీ నేత ఒకరు వ్యాఖ్యానించారు. "మాకూ ఈ స్థానాలు చాలా ముఖ్యం. నార్త్ 24 పరగణాల జిల్లాలో మతువాలు, శరణార్థుల ఓట్లను కొల్లగొడితే మాకు పని సులువు అవుతుంది"అని బీజేపీ సీనియర్ నేత చెప్పారు. ఒకప్పుడు ఈ ప్రాంతం వామపక్ష పార్టీలకు కంచుకోటగా ఉండేది. 2006లో సీపీఐ(ఎం) లెఫ్ట్ కూటమి ఏకంగా 72 చోట్ల గెలిచింది. కానీ సచార్ కమిటీ నివేదిక తర్వాత ముస్లింలు లెఫ్ట్‌పార్టీలకు ముఖంచాటేశారు. సింగూర్--నందిగ్రామ్ ఉద్యమం తర్వాత మమతబెనర్జీ హవా కొనసాగి ఈ ప్రాంతంపై టీఎంసీ పట్టుసాధించింది. ఇప్పుడీ ప్రాంతం మమత ప్రభుత్వానికి రాజకీయ ఇంజిన్‌గా మారింది. 2008లో దక్షిణ 24 పరగణాలు, పూర్బా మేదినీపూర్ జిల్లా పరిషత్‌లను గెల్చుకుని టీఎంసీ ఇక్కడ పాగావేసింది. నార్త్ 24 పరగణాల్లో బంగ్లాదేశ్ సరిహద్దు ఉండటంతో అక్కడి నుంచి వచ్చిన శరణార్థులు ఎక్కువ. ఇక్కడి మతువాలు 14 సీట్లలో నిర్ణయాత్మక ఓటు బ్యాంక్‌గా ఉన్నారు. వీళ్లందరికీ పౌరసత్వం ఇస్తామని, సీఏఏ అమలుచేస్తామని బీజేపీ చేసిన వాగ్దానాలు పనిచేశాయి. దీంతో 2021లో ఇక్కడి ప్రెసిడెన్సీ డివిజన్‌లో బీజేపీ గెల్చింది. 2024 లోక్‌సభ ఎన్నికలవేళ నదియాలోని 11 అసెంబ్లీ, నార్త్ 24 పరగణాల్లో ఎనిమిది సెగ్మెంట్లలో బీజేపీ ఓట్ల శాతం మెరుగుపడింది.

## ఆయిల్ కంపెనీ ప్రతినిధులతో అధికారుల వరుస సమావేశాలు

చేరుకునేంత వరకు ఎవ్వరూ విశ్రమించవద్దని, ఆర్టీజీఎస్ నుంచి నిరంతరం పర్యవేక్షిస్తూనే ఉండాలని స్పష్టం చేశారు. ఆయిల్ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతూ, క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని ఆదేశించారు.సోమవారం మొత్తంగా 2,679 లోడ్లను రాష్ట్రంలోని వివిధ పెట్రోల్ బంకులకు పంపాలని ప్రణాళికలు సిద్ధం చేస్తే వాటిల్లో 2,079 లోడ్లు ఇప్పటికే బయలుదేరాయని, వీటిల్లో కొన్ని గమ్యస్థానాలకు చేరుకున్నట్టు అధికారులు వివరించారు. ఇక మిగిలిన మరో 600 లోడ్లను డిస్పాచ్ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఈ 2,079 లోడ్లల్లో 11,909 కిలోలీటర్ల పెట్రోల్, 19,707 కిలోలీటర్ల డీజిల్ వివిధ బంకులకు వెళ్లాయని అన్నారు.రాష్ట్రంలోని మూడు ఆయిల్ సరఫరా కంపెనీలైన ఐఓసీఎల్, బీపీసీఎల్, హెచ్‌సీఎల్ సంస్థల ద్వారా ఈ మొత్తం లోడ్ డిస్పాచ్ అయిందని, ప్రతి లోడ్‌కు రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని అటాచ్ చేసి పంపుతున్నట్టు అధికారులు వెల్లడించారు. డిస్పాచ్ అయ్యే ప్రాంతం నుంచి దూరంగా ఉండే ప్రాంతాలకు లోడ్‌లు చేరడం కొంచెం ఆలస్యమవుతోందని అధికారులు వెల్లడించారు.రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ లోడ్ డిస్పాచ్ రాత్రిపూట కూడా జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆదివారం నాటితో పోల్చుకుంటే సోమవారం ఆయిల్ సరఫరా మెరుగైంది. ఇక సోమవారం ఉదయంతో పోల్చుకుంటే, సాయంత్రానికి అనకాపల్లి, తూర్పు గోదావరి, గుంటూరు, కృష్ణా, బాపట్ల, పల్నాడు, నంద్యాల, అనంతపురం, మార్కాపురం వంటి జిల్లాల్లో బంకుల్లో పెట్రోల్, డీజిల్ లభ్యత మెరుగైంది. ఇక రాష్ట్రవ్యాప్తంగా సోమవారం రాత్రి ఏడు గంటల సమయానికి 6,511 కిలోలీటర్ల పెట్రోల్, 9,046 కిలోలీటర్ల మేర అమ్మకాలు జరిగాయి.

## ఇంధన కొరత ఏర్పడినందుకు చంద్రబాబు సిగ్గుపడాలి: షర్మిల

### సమీక్షలు, సలహాలతో ఇంధన కొరత తీరదన్న షర్మిల

### రాష్ట్రంలో 70 శాతం బంకులు మూతపడ్డాయని వ్యాఖ్య

### కూటమి ప్రభుత్వ పాలనా వైఫల్యమని ఆరోపణ

రాష్ట్రంలో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్రంగా స్పందించారు. కేవలం సమీక్షలు, సలహాలతో ఇంధన కొరత తీరదని, 24 గంటల డెడ్ లైన్‌తో ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 70 శాతం బంకులు మూతపడటం అత్యంత దారుణమని, దీనిని అత్యవసర పరిస్థితిగా గుర్తించి సరఫరాను పునరుద్ధరించాలని కోరారు. "దేశంలో ఎక్కడా లేని ఇంధన కొరత ఏపీలోనే ఏర్పడినందుకు చంద్రబాబు సిగ్గుపడాలి. ప్రజలను ఎర్రటి ఎండలో కిలోమీటర్ల మేర నిలబెట్టడం కూటమి పాలనా వైఫల్యానికి నిదర్శనం" అని షర్మిల మండిపడ్డారు. మోదీకి మద్దతు ఇచ్చి ప్రధాని పీఠంపై కూర్చోబెట్టినా రాష్ట్రానికి ఇంధన కష్టాలు రావడం బాధాకరమన్నారు. ఇంధన కొరత వల్ల నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే ప్రమాదం ఉందని, ప్రభుత్వం వెంటనే నిద్రమత్తు వీడాలని హెచ్చరించారు.

## ఎమ్మెల్సీలుగా కోదండరాం, అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం

గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆదేశాల మేరకు సాధారణ పరిపాలన శాఖ ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రమాణ స్వీకారం అనంతరం మంత్రి అజారుద్దీన్ మీడియాతో మాట్లాడుతూ, ఎమ్మెల్సీగా తనను ప్రతిపాదించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి, మంత్రి మండలికి, పీసీసీకి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. మైనార్టీల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానని అన్నారు. రాజకీయాల్లో, జీవితంలో ఎత్తుపల్లాలు వస్తుంటాయని, అన్నింటిని అధిగమిస్తూ ముందుకు సాగాలని అన్నారు. జుబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలో ముస్లింల ఓట్ల కోసం తనకు మంత్రి పదవి ఇచ్చారనే వాదనలో వాస్తవం లేదని అన్నారు.

## బీఆర్ఎస్ ఓ 'చచ్చిన శవం'..

(మొదటి పేజీ తరువాయి)

ఇదే క్రమంలో కల్వకుంట్ల కవిత ప్రకటించిన కొత్త పార్టీపై పరోక్షంగా సెటైర్లు వేస్తూ.. రాష్ట్రంలో కొత్త పార్టీ పెట్టాల్సిన అవసరమే లేదని, అసలు ఉన్న పార్టీయే (బీఆర్ఎస్) ఉంటుందో, ఊడుతుందో తెలియని స్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర రాజకీయాల్లో కొత్త పార్టీలకు ప్రజలు అవకాశం ఇవ్వరని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## నాలాంటి వాళ్లకు ఇదొక ఎమోషన్

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రా యూనివర్సిటీ (ఏయూ) కేవలం ఒక విద్యాసంస్థ మాత్రమే కాదని, తన లాంటి వారికి అదొక ఎమోషన్ అని, ఇది ఆంధ్రప్రదేశ్‌కే కాక యావత్ భారతదేశానికే గర్వకారణమని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. సోమవారం విశాఖపట్నంలోని ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో అత్యంత వైభవంగా జరిగిన విశ్వవిద్యాలయ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలో ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పాల్గొన్నారు. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో లోకేష్ కీలక ప్రసంగం చేశారు.ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. "శతాబ్ద కాలంగా విజ్ఞాన కాంతులు పంచుతున్న ఏయూ గొప్పదనాన్ని జరుపుకోవడం గర్వంగా ఉంది. 2014లో రాష్ట్రం విడిపోయినప్పుడు రాజధాని, సచివాలయం, కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా లేని నిస్సహాయ స్థితిలో ఉన్నాం. కట్టుబట్టలతో మనల్ని బయటకు గెంటేశారు. ఆనాడు మనకున్నవి రెండే ఆస్తులు. ఒకటి ఆంధ్రా యూనివర్సిటీ, రెండు మన బ్రాండ్ సీబీఎన్. రాష్ట్ర విభజన తర్వాత మొదటి కేబినెట్ సమావేశం పెట్టుకోవడానికి కూడా చోటులేని పరిస్థితుల్లో ఏయూనే మాకు ఆశ్రయమిచ్చింది. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు తొలి అసెంబ్లీ సమావేశాలు కూడా ఇక్కడే జరిగాయి. ఇది ఏయూ చరిత్రలో మరువలేని ఘట్టం" అని గుర్తుచేశారు.

**భవిష్యత్ లక్ష్యాలపై స్పష్టమైన ప్రకటన**

విద్యార్థులను ఉద్దేశించి లోకేష్ మాట్లాడుతూ.. "నేను స్టాన్‌ఫోర్డ్, కార్నెగీ మెలన్ వంటి విశ్వవిద్యాలయాల్లో చదివినప్పటికీ, ఈరోజు మిమ్మల్ని చూసి అసూయ పడుతున్నాను. ఏయూలో చదివి ఉంటే బాగుండేదనిపిస్తోంది. మీ జోష్ చూశాక మీ కోసం మరింత కష్టపడాలనే తపన పెరుగుతోంది" అని అన్నారు. ఎంతోమంది మహానుభావుల త్యాగాలతో, దార్శనికుల కృషితో ఏయూ ఉన్నత శిఖరాలను అధిరోహించిందని, సీఆర్ రెడ్డి, సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి వారి సేవలను కొనియాడారు. ప్రస్తుతం ఏయూ.. రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్‌లో 4వ స్థానంలో ఉందని, అయితే ఇది తనకు సంతృప్తినివ్వడం లేదని స్పష్టం చేశారు. "ఆంధ్ర విశ్వవిద్యాలయం దేశంలోనే ఓవరాల్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానం, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్ 100లో నిలిచినప్పుడే విద్యాశాఖ మంత్రిగా నాకు సంతృప్తి. ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్ కృషి చేయాలి" అని దిశానిర్దేశం చేశారు.

**అమీర్ పేటలో నాలుగు నెలలు చాలు!**

పరిశ్రమలకు, విద్యకు మధ్య ఉన్న అంతరాన్ని (స్కిల్ గ్యాప్) తొలగించాల్సిన అవసరం ఉందని లోకేష్ నొక్కి చెప్పారు. "నాలుగేళ్ల ఇంజనీరింగ్ చేసినా ఉద్యోగం సంపాదించలేని పరిస్థితి ఉండగా, అమీర్‌పేట్‌లో నాలుగు నెలల కోర్సుతో జాబ్ కొడుతున్నారు. ఈ స్కిల్ గ్యాప్‌కు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు పరిశ్రమలతో అనుసంధానం తప్పనిసరి. విద్యార్థులు ఏడాది పాటు ఫీల్డ్‌లో పనిచేసేలా విధానాలు తీసుకొస్తాం" అని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఏడాదిలోగా యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను యుద్ధప్రాతిపదికన భర్తీ చేస్తామని ప్రకటించారు.ఈ వేడుకల్లో గవర్నర్ అబ్దుల్ నజీర్, మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు, భారతరత్న సచిన్ టెండూల్కర్, కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాసవర్మ, సినీ దర్శకులు త్రివిక్రమ్ శ్రీనివాస్, పారిశ్రామికవేత్తలు గ్రంథి మల్లికార్జునరావు, బీవీఆర్ మోహన్ రెడ్డి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## వివాదంలో అషు రెడ్డి...


(మొదటి పేజీ తరువాయి)

బిగ్‌బాస్ ఫేమ్ అషురెడ్డిపై వచ్చిన రూ.9.5 కోట్ల మోసం ఆరోపణల వ్యవహారం కొత్త మలుపు తీసుకుంది. ఈ వివాదంపై అషురెడ్డి తండ్రి వెంకటకృష్ణారెడ్డి తొలిసారిగా మీడియా ముందుకొచ్చి సంచలన విషయాలు వెల్లడించారు. తన కూతురు అమాయకురాలని, అసలు తప్పు అవతలి వారిదేనని ఆయన పేర్కొన్నారు. రేపు (సోమవారం) అషురెడ్డి స్వయంగా ప్రెస్ మీట్ పెట్టి అన్ని విషయాలు వివరిస్తుందని తెలిపారు.

వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. "2021లో కాకినాడ నుంచి సత్యనారాయణ అనే వ్యక్తి ఫోన్ చేసి, అషురెడ్డికి పెళ్లి సంబంధం గురించి మాట్లాడారు. మా అమ్మాయి గురించి మీకెలా తెలుసు అని అడిగాను. మీ అమ్మాయికి, మా అబ్బాయి ధర్మేంద్రకు ఉద్యోగం చేసే దగ్గర పరిచయం అని ఆయన చెప్పారు. అయితే, మేము తెలిసిన వారి ద్వారా విచారించగా కొన్ని నిజాలు తెలిశాయి. అప్పటికే ధర్మేంద్రకు పెళ్లయి విడాకుల కేసు నడుస్తోందని, తండ్రి సత్యనారాయణ నడుపుతున్న ఫైనాన్స్ కంపెనీపై కాల్ మనీ కేసు ఉందని తెలిసింది. దీంతో ఈ సంబంధం వద్దని నిర్ణయించుకున్నాం" అని వెంకటకృష్ణారెడ్డి వివరించారు.ఆ తర్వాత వారి గురించి మళ్లీ ఇప్పుడే వింటున్నామని ఆయన అన్నారు. తన కూతురు తల్లి ప్రోత్సాహంతోనే ఇండస్ట్రీలోకి వచ్చిందని, ఆమెకు బయట ప్రపంచం గురించి పెద్దగా తెలియదని వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. "మా అమ్మాయి అమాయకురాలు. ఆమెపై వచ్చిన ఆర్థిక ఆరోపణల్లో వాస్తవం లేదు. వాటికి ఎలాంటి ఆధారాలు లేవు. ఒకవేళ ఉంటే నిరూపించుకోవాలి" అని ఆయన సవాల్ విసిరారు. ప్రస్తుతం అషురెడ్డి వేరే ఊరిలో ఉందని, ఈ రాత్రికల్లా హైదరాబాద్ చేరుకుంటుందని తెలిపారు. సోమవారం ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి, ఈ వివాదం వెనుక ఉన్న అసలు నిజాలను అషురెడ్డే స్వయంగా వెల్లడిస్తుందని ఆయన స్పష్టం చేశారు. దీంతో ఈ వ్యవహారంలో అషురెడ్డి ఏం చెప్పబోతుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

### అంబర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం.. మహీంద్రా సర్వీస్ సెంటర్‌లో చెలరేగిన మంటలు!

హైదరాబాద్ అంబర్‌పేటలోని 6 నంబర్ చౌరస్తా వద్ద ఉన్న మహీంద్రా సర్వీస్ సెంటర్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. భారీగా మంటలు ఎగిసిపడటంతో ఆ ప్రాంతమంతా నల్లటి దట్టమైన పొగ కమ్మేసింది. ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో మరిన్ని ఫైర్ ఇంజిన్లను రంగంలోకి దింపి మంటలను అదుపు చేసేందుకు శ్రమిస్తున్నారు. సర్వీస్ సెంటర్ పక్కనే నివాస సముదాయాలు ఉండటంతో, మంటలు వ్యాపిస్తాయేమోనన్న భయంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ముందుజాగ్రత్త చర్యగా సమీప ఇళ్లలోని వారిని అధికారులు అక్కడి నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ ప్రమాదంలో సర్వీస్ సెంటర్‌లోని పలు వాహనాలు, విడిభాగాలు అగ్నికి ఆహుతైనట్లు తెలుస్తోంది. ప్రమాదానికి గల కారణాలు (షార్ట్ సర్క్యూట్ లేదా ఇతరత్రా) ఇంకా తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



## భావితరాలకు ఆదర్శం సర్వాయి పాపన్న

**- కుర్రారంలో ఘనంగా విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ**




**తొలివెలుగు, రాజాపేట:** బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, దార్శనికుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జీవితం భావితరాలకు ఆదర్శప్రాయమని పలువురు వక్తలు కొనియాడారు. రాజపేట మండలం కుర్రారం గ్రామంలో కాటమయ్య యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం సర్వాయి పాపన్న మహారాజ్ విగ్రహావిష్కరణకు ఉద్దేశించిన భూమిపూజ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి, బహుజన రాజ్యాన్ని స్థాపించిన గొప్ప వీరుడు పాపన్న అని ఈ సందర్భంగా నాయకులు గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తూ, గ్రామాల్లో అన్ని వర్గాల ప్రజలు ఐక్యమత్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కాటమయ్య యువజన సంఘం సభ్యులు ఈ విగ్రహ ఏర్పాటుకు పూనుకోవడం అభినందనీయమన్నారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా జరిగిన ఈ శంకుస్థాపన కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, గౌడ సంఘం ముఖ్య నాయకులతో పాటు వివిధ కుల సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో 'వాసవి' జయంతి వేడుకలు

**- వైభవంగా వేడుకలు నిర్వహించిన ఆర్యవైశ్యులు**

**- ?ప్రభుత్వ నిర్ణయంపై హర్షాతిరేకాలు**



**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షులు నంగునూరు చంద్రశేఖర్, ట్రస్ట్ అభివృద్ధి సేవా కమిటీ సభ్యుల పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆర్యవైశ్య మహిళలందరూ ఏకరూప దుస్తులు ధరించి, అమ్మవారి చిత్రపటం వద్ద సామూహిక స్తోత్ర పారాయణం చేయడం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి, విశేషార్చనలు చేశారు. మంగళహారతులు పాడుతూ భక్తిపారవశ్యంలో మునిగితేలారు. వాసవి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తించడం పట్ల ఆర్యవైశ్యులు ఈ సందర్భంగా సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అల్పాహార వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆర్యవైశ్య ప్రముఖులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## స్టెప్పులేసిన టీచరమ్మ.. విద్యార్థులతో కలిసి దాండియా!

**- రాజాపేట పీఎంశ్రీ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు**

**- ఆకట్టుకున్న ఉపాధ్యాయురాలి చొరవ**

**తొలివెలుగు, రాజాపేట:** చదువుతో పాటు విద్యార్థులలో దాగి ఉన్న కళా నైపుణ్యాలను వెలికితీయడంలో ఆ ఉపాధ్యాయురాలు ముందున్నారు. రాజాపేట మండల కేంద్రంలోని పీఎంశ్రీ బాలుర ఉన్నత పాఠశాలలో హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పెరుమళ్ళ పాట్రిసీయా విద్యార్థులతో కలిసి అడుగులు వేశారు. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఆమె దాండియా ఆడి అందరినీ ఆశ్చర్యపరిచారు. గత రెండేళ్లుగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఆమె, తరగతి గదిలో బోధనతో పాటు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపేందుకు ఆటపాటల్లోనూ భాగస్వామ్యం అవుతున్నారు. ఉపాధ్యాయురాలు స్వయంగా విద్యార్థులతో కలిసి నృత్యం చేయడంతో తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు చప్పట్లతో ఆమెను అభినందించారు.

## శ్రీ సత్యనారాయణ స్వామి సన్నిధికి పిండి గిర్ని విరాళం

**తొలివెలుగు, జన్నారం:** దండేపల్లి మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన గూడెంగుట్ట శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయానికి జన్నారం మండలం పొనకల్ గ్రామానికి చెందిన ప్రముఖ దాత గోలి శ్రీనివాస్ పిండి గిర్నిని విరాళంగా అందజేశారు. క్షేత్రానికి వచ్చే భక్తుల కోసం ఆలయ అధికారులు నిత్యం లడ్డూ ప్రసాదాన్ని సిద్ధం చేస్తుంటారు. ఈ ప్రసాద తయారీలో శనగపిండి ప్రధానమైనది కావడంతో, ప్రసాద విక్రయాల అవసరాల దృష్ట్యా సుమారు రూ. 65 వేల విలువైన పిండి గిర్నిని ఆయన సొంత ఖర్చులతో కొనుగోలు చేసి ఆలయ అధికారులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ.. దాతల సహకారం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ కుటుంబ సభ్యులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## యాదాద్రీశుని సన్నిధిలో నారా భువనేశ్వరి





**- ఘనస్వాగతం పలికిన టీడీపి శ్రేణులు**

**- గర్భాలయంలో ప్రత్యేక పూజలు.. వేద పండితుల ఆశీర్వచనం**

**- ప్రసాదం అందజేసిన ఆలయ ఈవో భవానీ శంకర్**

**- మండల, పట్టణ అధ్యక్షుల ఆధ్వర్యంలో మర్యాదపూర్వక భేటీ**

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:** యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఆమె స్వామివారి గర్భాలయంలో స్వయంభూ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం క్షేత్రంలోని ముఖ మండపంలో భువనేశ్వరి దేవికి వేద పండితులు ఆశీర్వచనం పలికారు. ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) భవానీ శంకర్ స్వామివారి తీర్థ ప్రసాదాలతో పాటు, స్వామివారి జ్ఞాపికను ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా భువనేశ్వరి రాకను పురస్కరించుకుని ఆలయ పరిసరాల్లో పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ రేగు బాల నరసయ్య, యాదగిరిగుట్ట మండల పార్టీ అధ్యక్షుడు మచ్చ నరసింహ గౌడ్, యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షుడు చిత్తర్ల శ్రీనివాస్ గౌడ్, ఆలయ ఈవో (కార్యనిర్వహణాధికారి) భవానీ శంకర్, స్థానిక నాయకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తిపారవశ్యంలో రాజాపేట.. నగర సంకీర్తనలో భక్తుల సందడి





**- హరే రామ హరే కృష్ణ నామస్మరణతో పురవీధుల పులకింత**

**- ఏకాదశి వేళ ప్రత్యేక పూజలు**

**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రంలో ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం నగర సంకీర్తన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. మర్కుక్ శ్రీ భవానంద స్వామి వారి ఆశీస్సులతో, అదరాసుపల్లి శ్రీధర్ శర్మ పర్యవేక్షణలో జరిగిన ఈ ఆధ్యాత్మిక ఊరేగింపు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీ రామకృష్ణ సాయి మందిరం నుంచి ప్రారంభమైన ఈ సంకీర్తన గ్రామ ప్రధాన వీధుల గుండా సాగింది. భక్తులు 'హరే రామ హరే కృష్ణ' నామ జపంతో గ్రామాన్ని భక్తిశ్రద్ధలతో ముంచెత్తారు.

స్థానిక సాయి మందిర అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శాఖా అధ్యక్షుడు నంగునూరు రాజు మాట్లాడుతూ.. సార్థ త్రి శతకోటి హరే రామ, హరే కృష్ణ నామ జప యజ్ఞంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన ఆలయాల సందర్శన అనంతరం మందిరంలో దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు, మంగళహారతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నంగునూరు రాజు, నాల్ల శేఖర్, నంగునూరు జగదాంబ, పెంట రజిత, నాల్ల పద్మ, బిర్రు భాగ్యలక్ష్మి, రేపాక భాగ్యలక్ష్మి, పరమేశ్వరి, పుష్పలత, కోనూరు బిక్షపతి, ఉప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రజక సంక్షేమానికి పెద్దపీట..

**- మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లీశ్వరిని కలిసిన జీడిమెట్ల రాంబాబు**

**- సమస్యల పరిష్కారానికి హామీ**



**తొలివెలుగు, కోదాడ:** రజక సంఘం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందిస్తానని కోదాడ మున్సిపల్ వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లీశ్వరి హామీ ఇచ్చారు. సోమవారం కోదాడలో ఆమెను రజక సంఘం రాష్ట్ర నాయకులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు జీడిమెట్ల రాంబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టణంలోని రజకుల సామాజిక భవన నిర్మాణ ప్రగతి, ధోబీఘాట్ల నిర్వహణ, స్థానికంగా ఎదురవుతున్న ఇతర ఇబ్బందులను రాంబాబు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వైస్ చైర్మన్ మాట్లాడుతూ.. సమాజ సేవలో రజకుల పాత్ర కీలకమని, వారి సంక్షేమానికి మున్సిపాలిటీ తరపున పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. రాంబాబు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులందరికీ అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వేదమంత్రాల సాక్షిగా.. వైభవంగా ఎస్ఐ అరవింద్ కుమార్ వివాహం

**- నూతన దంపతులను ఆశీర్వదించిన ప్రముఖులు**



**తొలివెలుగు, టేక్మాల్ :** మెదక్ జిల్లా టేక్మాల్ మండల పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న హలావత్ అరవింద్ కుమార్ వివాహ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా కోస్గి క్రాస్ రోడ్డులో ఉన్న కింగ్స్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆరాధ్య (హిమబిందు)తో అరవింద్ కుమార్ ఏడడుగులు నడిచారు. ఉదయం 11:31 గంటలకు నిర్ణయించిన కటక లగ్న సుముహూర్తాన వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య, బంధుమిత్రుల సమక్షంలో ఈ వివాహ వేడుక శాస్త్రోక్తంగా, కన్నుల పండువగా సాగింది.

ఈ వివాహ మహోత్సవానికి పలువురు ప్రజాప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. ముఖ్య అతిథులుగా టేక్మాల్ మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు నిమ్మ రమేష్, టేక్మాల్ సర్పంచ్ తిమ్మిగారి సుధాకర్, జిల్లా మైనారిటీ చైర్మన్ షేక్ మజార్, టౌన్ ప్రెసిడెంట్ భక్తుల కిషోర్, మాజీ ఎంపీపీ మాణి కిషన్, మాజీ సర్పంచ్ ఆకులపల్లి పాపయ్యలతో పాటు పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు విచ్చేసి వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వీరే కాకుండా పోలీస్ శాఖకు చెందిన ఉన్నతాధికారులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తోటి సిబ్బంది సందడి నడుమ వివాహ వేడుక అత్యంత ఘనంగా ముగిసింది.

## టీజీఎండీసీ ఎండీగా అనుదీప్ దురిశెట్టి బాధ్యతల స్వీకరణ

**- ఖైరతాబాద్ కార్యాలయంలో బాధ్యతల స్వీకారం**

**- శుభాకాంక్షలు తెలిపిన అధికారులు, సిబ్బంది**



**తొలివెలుగు, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (టీజీఎండీసీ) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా ఐఏఎస్ అధికారి అనుదీప్ దురిశెట్టి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఖైరతాబాద్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. 2018 బ్యాచ్‌కు చెందిన అనుదీప్ దురిశెట్టి ప్రస్తుతం ఖమ్మం జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తుండగా, ప్రభుత్వం ఆయనను గనులు, భూగర్భ శాఖ డైరెక్టర్‌తో పాటు టీజీఎండీసీ వీసీ అండ్ ఎండీగా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

ఇప్పటివరకు ఇక్కడ బాధ్యతలు నిర్వర్తించిన భవేష్ మిశ్రా నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ కావడంతో ఆయన స్థానంలో అనుదీప్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన ఎండీకి సంస్థ జనరల్ మేనేజర్లు ఎల్లయ్య, రాజశేఖర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు, ఉద్యోగ సంఘాల నేతలు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన అధికారులతో కొద్దిసేపు సమీక్ష నిర్వహించి సంస్థ కార్యకలాపాలపై ఆరా తీశారు.



## ఘనంగా బిఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

**- కాంగ్రెస్‌కు కాలం చెల్లింది: మండల పార్టీ అధ్యక్షుడు సట్టు తిరుమలేష్**

**- గ్రామగ్రామాన గులాబీ పండగ**

**తొలివెలుగు, రాజాపేట:**

రాజాపేట మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం అంగరంగ వైభవంగా జరిగాయి. మండల కేంద్రంలోని పార్టీ దిమ్మె వద్ద మండల పార్టీ అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ గులాబీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమించే పార్టీగా బీఆర్ఎస్ ప్రజల హృదయాల్లో నిలిచిపోయిందన్నారు. స్వరాష్ట్రం కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ప్రస్తుతం 'రాబందుల రాజ్యం' నడుస్తోందని విమర్శించారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధ్వజమెత్తారు.

మహిళా అధ్యక్షురాలు బాలలక్ష్మి మాట్లాడుతూ.. కేసీఆర్ సారథ్యంలో ఒక చిన్న మొక్కగా ప్రారంభమైన పార్టీ నేడు మహావృక్షమైందని, గత పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండేవారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బెడిద వీరేశం, మదర్ డైరీ డైరెక్టర్ సందిల భాస్కర్ గౌడ్, మాజీ ఎంపీపీ గొపగాని బాలమణి యాదగిరి గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాకల ఉపేందర్, జలసాధన సమితి మండల కన్వీనర్ ఎర్ర గోకుల జస్వంత్, మాజీ ఎంపీటీసీ భోగ హరినాథ్, మాజీ ప్రజా ప్రతినిధుల ఫోరం జిల్లా అధ్యక్షులు బొంగోని ఉప్పలయ్య గౌడ్, మాజీ సర్పంచి నాగిర్తి గోపాల్ రెడ్డి, ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గుర్రం నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

# కాళీయమర్దనుడిగా నరసింహుడు





- యాదగిరిగుట్టలో జయంతి ఉత్సవాల కోలాహలం
- భక్తిశ్రద్ధలతో లక్ష పుష్పార్చన, హోమాలు

**తొలివెలుగు, యాదగిరిగుట్ట:**
యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి జయంతి ఉత్సవాలు రెండో రోజు సోమవారం అత్యంత వైభవంగా కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి, అమ్మవార్లకు పంచామృత అభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి విశేష అభిషేకాలను కావించి, అనంతరం పట్టువస్త్రాలు, రకరకాల పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించారు.

**నయనానందకరంగా పుష్పార్చన:**
స్వామివారికి మల్లె, మందారం, జాజి, విరజాజి, గులాబీ, చామంతి వంటి సుగంధ భరిత పుష్పాలతో 'లక్ష పుష్పార్చన' చేపట్టారు. సుమారు గంటన్నర పాటు అర్చకులు సహస్రనామ పఠనం చేస్తూ స్వామివారిని అర్చించారు. యాగశాలలో సుదర్శన, నారసింహ, గరుడ, లక్ష్మీ మంత్రాలతో హోమాలను వైభవంగా నిర్వహించారు.

**పురవీధుల్లో ఊరేగింపు:**
సాయంత్రం స్వామివారిని కాళీయమర్దనుడి అలంకారంలో ముస్తాబు చేసి ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. మంగళవాయిద్యాలు, వేదనాదాల మధ్య సాగిన ఈ సేవను భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ నరసింహమూర్తి, ఈవో భవాని శంకర్, ప్రధాన అర్చకులు కాండూరి వెంకటాచార్యులు, ఏఈఓ శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## కోరంపల్లిలో ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు

- పార్టీ జెండాను ఆవిష్కరించిన మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ విఠల్
- పార్టీ బలోపేతానికి కృషి చేయాలని శ్రేణులకు పిలుపు

**తొలివెలుగు, టేక్మాల్ :**
మెదక్ జిల్లా టేక్మాల్ మండల పరిధిలోని కోరంపల్లి గ్రామంలో భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. పండుగ వాతావరణంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద గులాబీ జెండాను ఎగురవేసి మిఠాయిలు పంచుకున్నారు. జై తెలంగాణ.. జై బీఆర్ఎస్ నినాదాలతో కోరంపల్లి వీధులు మారుమోగాయి.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ విఠల్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు జరిగిన ప్రస్థానాన్ని గుర్తుచేశారు. కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలని, రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ అంకితభావంతో, సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో పార్టీని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు. ఈ వేడుకల్లో గ్రామ సీనియర్ నాయకులు లక్ష్మీమల్లయ్య, కిషన్, రాంరెడ్డి, చంద్రయ్య కుమార్, మరో నాయకుడు కిషన్, గంగారములు, రవీందర్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు ఉప్పరి శంకరయ్య, కిష్టయ్య, కల్లు దుర్గయ్య, శ్రీను, బీరప్ప, రాజు, ప్రవీణ్, కేశవులు, నారాయణ, దుర్గ నర్సింలు, లింగం, నవీన్, వెంకట్ తదితర పార్టీ నాయకులు, అధిక సంఖ్యలో యువకులు, కార్యకర్తలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ప్రకాశ్ రెడ్డి కోసం 'చేయి' విడిచిన కార్యకర్తలు

- సస్పెన్షన్‌కు నిరసనగా ముక్తాపూర్‌లో 50 మంది రాజీనామా
- అధిష్టానం తీరుపై మండిపడ్డ అనుచరులు



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** పట్టణ కాంగ్రెస్ నేత బండారు ప్రకాశ్ రెడ్డిపై పార్టీ అధిష్టానం సస్పెన్షన్ వేటు వేయడం స్థానికంగా రాజకీయ కలకలం రేపింది. ఈ నిర్ణయానికి నిరసనగా సోమవారం ముక్తాపూర్ గ్రామానికి చెందిన సుమారు 50 మంది ముఖ్య నాయకులు, కార్యకర్తలు పార్టీకి మూకుమ్మడి రాజీనామాలు ప్రకటించారు. ప్రకాశ్ రెడ్డికి మద్దతుగా నిలిచిన వారంతా తమ రాజీనామా పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తిని, పదవి అడిగినంత మాత్రాన సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని విమర్శించారు. నిబద్ధతతో పనిచేసే కార్యకర్తల పట్ల ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజీనామా చేసిన వారిలో రెడ్డి సంఘం అధ్యక్షుడు బండారు జంగారెడ్డి, బండారు బాలిరెడ్డి, రెండో వార్డు కార్యదర్శి కొండమడుగు శ్రీకాంత్, యూత్ అధ్యక్షుడు పోతగల తరుణ్, నాయకులు ఒంటెద్దు ఎల్లయ్య, రాజు, బాలకృష్ణ, వినోద్ రెడ్డి ఉన్నారు.

## నేతన్నల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన
- వైభవంగా మెగా వైద్య శిబిరం.. ఉచితంగా కంటి అద్దాల పంపిణీ



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** చేనేత కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తోందని, వీటిని కార్మికులందరూ సద్వినియోగం చేసుకోవాలని చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు (ఏడీ) శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక డైహౌస్‌లో జిల్లా చేనేత జౌళి శాఖ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో కార్మికులకు మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ.. నిరంతరం శ్రమించే చేనేత కార్మికులకు కంటి సమస్యలు, ఆర్థోపెడిక్ సంబంధిత ఇబ్బందులు ఎదురవుతుంటాయని, వాటిని దృష్టిలో ఉంచుకుని ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యేకంగా కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా బీపీ, షుగర్, గుండె సంబంధిత పరీక్షలు చేసి మందులనుప్తఉ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీవాణి, కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ అభివృద్ధికి బీఆర్ఎస్సే దిక్సూచి



- భూదాన్ పోచంపల్లిలో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు
- కాంగ్రెస్ తీరుపై మాజీ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి ధ్వజం

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:**
భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు సోమవారం స్థానిక పురపాలక కేంద్రంలో పండుగ వాతావరణంలో జరిగాయి. మండల, పట్టణ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ జెండాను అధ్యక్షులు పాటి సుధాకర్ రెడ్డి, సీత వెంకటేష్ ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. 14 ఏళ్ల సుదీర్ఘ పోరాటంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా, పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అసాధ్యమన్న హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ప్రస్తుతం ప్రజలను వంచిస్తోందని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధి కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని, రాబోయే రోజుల్లో మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కోట మల్లారెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కందడి భూపాల్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, వైస్ చైర్మన్ లింగస్వామి యాదవ్, మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు గుండు రాజేశ్వరి, మండల, పట్టణ ప్రధాన కార్యదర్శులు చిలువేరు బాల నరసింహ, గునిగంటి మల్లేష్ గౌడ్, యువజన విభాగం అధ్యక్షుడు శ్రీకాంత్, అలాగే పర్సమోని సత్తయ్య గౌడ్, మంగళపల్లి శ్రీహరి, పెద్దల యాదయ్య, సీత శ్రవణ్, భారత గిరి వాసు, కొయ్యడ నరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## నేతన్నల స్థితిగతులకు అద్దం.. 'చేనేత డైరీ'

- ఆవిష్కరించిన చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్
- సంఘమిత్ర సంస్థ కృషిపై ప్రశంసలు



తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి: చేనేత కార్మికుల స్థితిగతులు, వారి సమస్యలపై అధ్యయనం చేస్తూ ప్రత్యేకంగా రూపొందించిన 'తెలంగాణ చేనేత డైరీ'ని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ (ఐఏఎస్) ఆవిష్కరించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఆమె కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. సంఘమిత్ర పబ్లికేషన్స్ ఎడిటర్ తడక యాదగిరి ఆధ్వర్యంలో ఈ డైరీని రూపొందించారు. ఈ సందర్భంగా శైలజ రామయ్యర్ మాట్లాడుతూ.. చేనేత రంగాన్ని కాపాడేందుకు, నేతన్నల పరిస్థితులను నిరంతరం అధ్యయనం చేస్తూ వారు చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత గజం అంజయ్య, వీవర్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ అరుణ్ కుమార్, చేనేత నాయకులు భారతల, జె.డి వెంకటేశ్వరరావు, జె.డి ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

## జేసీపీ ఓనర్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్షుడిగా నోముల ప్రభాకర్ రెడ్డి
- గంటకు రూ. 1500గా అద్దె ఖరారు





**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:**
మండల జేసీపీ యజమానుల సర్వసభ్య సమావేశం సోమవారం పురపాలక కేంద్రంలో ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం, నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా నోముల ప్రభాకర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా దిరావత్ పరమేష్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా షేక్ జాన్ పాషా, కోశాధికారిగా మల్లేపల్లి నరేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శిగా పోతగల్ల రవి, సలహాదారుగా గోదాసు ప్రవీణ్‌లు ఎన్నికయ్యారు. అనంతరం కొత్త అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం స్పేర్ పార్ట్స్, ఆయిల్ ధరలు, డ్రైవర్ల వేతనాలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో జేసీపీ అద్దెను గంటకు రూ. 1500గా నిర్ణయించినట్లు వెల్లడించారు. వినియోగదారులు ఈ మార్పును గమనించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మల్లారెడ్డి రఘుమారెడ్డి, దిలీప్ రెడ్డి, కుమార్, బన్నిరెడ్డి, బద్దం భాస్కర్ రెడ్డి, బాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబాపై అసత్య ప్రచారాలు తగవు

- సామవేదం షణ్ముఖ శర్మపై చర్యలు తీసుకోవాలి
- వలిగొండ పోలీస్ స్టేషన్‌లో ఆలయ కమిటీ ఫిర్యాదు




తొలివెలుగు, వలిగొండ: షిరిడి సాయిబాబాపై సోషల్ మీడియా, వివిధ మాధ్యమాల ద్వారా అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వలిగొండ సాయిబాబా ఆలయ కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం ఆలయ చైర్మన్ గౌరిశెట్టి అశోక్ గుప్తా ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాబా వారికి సనాతన ధర్మానికి సంబంధం లేదని, ఆయన దేవుడు కాదంటూ బాబా భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా సామవేదం షణ్ముఖ శర్మ, సుగుణ కరుణాకర్, దుయ్యాడ శివప్రసాద్ తదితరులు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి వ్యాఖ్యలను ప్రోత్సహిస్తున్న ఛానళ్లపై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గజ్జెల అమరేందర్, గజ్జెల సతీష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి నగదు
- పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- పాల్గొన్న చౌటుప్పల్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య





**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:**
రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చౌటుప్పల్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. సోమవారం మండలంలోని మెహర్ నగర్, హైదర్ పూర్, జిబ్లాక్ పల్లి, వంకమామిడి, సల్లోనిగూడెం గ్రామాల్లో ఐకేపీ కేంద్రాలను, అలాగే ధర్మారెడ్డి పల్లి, భీమనపల్లి, కనుముక్కల గ్రామాల్లో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటను కొనుగోలు కేంద్రాల్లో విక్రయిస్తే 48 గంటల్లోనే ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించామన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాక మల్లేష్ యాదవ్, జిల్లా నాయకులు సామ మధుసూదన్ రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కందడి భూపాల్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ సామ మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సురివి వెంకటేష్ గౌడ్, మర్రి రాజిరెడ్డి, సర్పంచులు సామ రవీందర్ రెడ్డి, చిలివేరు లక్ష్మయ్య, కర్నాటి వరలక్ష్మి పాండు, ఆర్ల కావ్య వెంకటేష్, చుక్క శోభా శంకర్, గోరుగంటి సువర్ణ రవీందర్, మచ్చ శ్రీనివాస్, ఏపీఎం తవరియా నాయక్, సీసీలు వసంత, కొండమడుగు మల్లేష్, ఉప సర్పంచులు గురువయ్య, ఆర్ల లింగస్వామి, అవనిగంటి పరమేష్, కొమరి విజయ్, పడమటి మహిపాల్ రెడ్డి, నాయకులు ఆకుల వెంకటేష్, ఆకుల శ్రీలత, సుధాకర్, కంటి లింగస్వామి యాదవ్, బోడిగి మల్లయ్య, సురివి కాటమరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..



## నిబంధనల మేరకే ఆస్పత్రుల నిర్వహణ

**- పెండింగ్ అప్లికేషన్లపై కలెక్టర్ సీరియస్ - 17 ఆస్పత్రుల గుర్తింపుపై మే 7న తేలనున్న నివేదిక - మే 7లోపు తనిఖీ నివేదికలు ఇవ్వాలి - జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశం**

**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ (డీఆర్ఏ) కమిటీ సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రభుత్వం నిర్దేశించిన కనీస ప్రమాణాలు (మినిమం స్టాండర్డ్స్) పాటించాలని స్పష్టం చేశారు. జిల్లాలో శాశ్వత గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్న 17 ఆస్పత్రుల దరఖాస్తులను ఈ సందర్భంగా సమీక్షించారు. వీటిపై ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించి మే 7వ తేదీలోపు సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఇకపై ప్రతి నెలా కమిటీ సమావేశం నిర్వహిస్తామని, పెండింగ్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు భాస్కర్ రావు, వెంకారెడ్డి, ఏఎస్పీ లక్ష్మీనారాయణ, డీఎంహెచ్ఓ డా. మనోహర్ పాల్గొన్నారు.

## అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకారెడ్డితో కలిసి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు మొత్తం 57 అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా భాస్కర్ రావు మాట్లాడుతూ.. అధికారులు క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలించి, బాధితులకు న్యాయం చేయాలన్నారు. వచ్చిన దరఖాస్తుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 39 ఉండగా, పంచాయతీ రాజ్–5, చేనేత–4, మున్సిపాలిటీ–2, ఐసీడీఎస్–2, వ్యవసాయం–2 చొప్పున అందాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, డీఆర్డీఓ నాగిరెడ్డి పాల్గొన్నారు.

## అక్రమ దత్తతలపై ఉక్కుపాదం మోపాలి

**- అవగాహన కల్పించేందుకు 'అడాప్షన్ హెల్ప్ డెస్క్' ఏర్పాటు**

**- జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ఆదేశం**






**తొలివెలుగు, యాదాద్రిభువనగిరి:** జిల్లాలో అక్రమ దత్తతలను అరికట్టడంతో పాటు, చట్టబద్ధమైన దత్తత ప్రక్రియపై ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధికారులను ఆదేశించారు. మహిళా శిశు, వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' (99 రోజుల యాక్షన్ ప్లాన్)లో భాగంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 'దత్తత సహాయ వాణి' (అడాప్షన్ హెల్ప్ డెస్క్) కేంద్రాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా జరిగే అక్రమ దత్తతలను నిరోధించాలని, క్షేత్రస్థాయిలో సిబ్బంది నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. 'చైల్డ్ వీక్' స్టాండీలను పరిశీలించిన ఆయన, బాలల హక్కుల పరిరక్షణలో రాజీ పడొద్దన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకా రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి నరసింహరావు, డీఆర్డీఓ నాగిరెడ్డి, డీఎంహెచ్ఓ మనోహర్, సిడబ్ల్యూసి చైర్ పర్సన్ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలకు బీఆర్ఎస్సే కేరాఫ్ అడ్రస్

**- కుట్రలతోనే అభివృద్ధిని అడ్డుకున్నారు: మొగుళ్ల శ్రీనివాస్**

**- వలిగొండలో ఘనంగా గులాబీ జెండా పండుగ**



తొలివెలుగు, వలిగొండ: తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించి, ప్రపంచ పటంలో నిలిపిన ఘనత బీఆర్ఎస్ పార్టీదేనని మాజీ జెడ్పీటీసీ మొగుళ్ల శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షుడు తుమ్మల వెంకట్ రెడ్డి అన్నారు. సోమవారం వలిగొండ మండల కేంద్రంలో పార్టీ 26వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పార్టీ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ అమరవీరులకు ఘన నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో పదేళ్ల పాలనలో సాగునీరు, ఐటీ, పారిశ్రామిక రంగాల్లో అద్భుత ప్రగతి సాధించామన్నారు. రైతుబంధు, కళ్యాణ లక్ష్మి వంటి పథకాలు ఇంటింటికీ వెలుగులు నింపాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి, వలిగొండ పట్టణ అధ్యక్షుడు ఎండి అఫ్రోజ్, బీసీ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్, యువజన విభాగం అధ్యక్షుడు పల్సం రాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎడవెల్లి శాంతికుమార్, మాజీ సర్పంచ్ వంగాల బిక్షపతి గౌడ్, సోషల్ మీడియా అధ్యక్షుడు కూచిమల్ల సుధాకర్, నాయకులు కొండూర్ వెంకన్న, సలీం, బత్తిని శేఖర్, కళ్లెం మారయ్య, బలుగురి నరేష్, మల్లం నరేష్, మల్లేష్, చెవ్వ వెంకటేష్, నాగిళ్ళ యాదయ్య, బూడిద స్వామి, మొతే వెంకటేష్, శ్రీశైలం పాల్గొన్నారు.

## ఇక్కడేమో పెట్రోల్.. అక్కడేమో డీజిల్!





**- వలిగొండలో అస్తవ్యస్తంగా ఇంధన సరఫరా**

**- బంకుల చుట్టూ వాహనదారుల ప్రదక్షిణలు**

**- పట్టించుకోని పౌరసరఫరాల శాఖ అధికారులు**

**తొలివెలుగు, వలిగొండ:** వలిగొండ మండలంలో ఇంధన సరఫరా వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది. గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న ఇంధన కొరత వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. మండలంలోని కొన్ని పెట్రోల్ బంకుల్లో కేవలం పెట్రోల్ మాత్రమే, మరికొన్ని చోట్ల కేవలం డీజిల్ మాత్రమే లభిస్తుండటంతో వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అవసరమైన ఇంధనం కోసం ఒక బంకు నుంచి మరో బంకుకు కిలోమీటర్ల దూరం తిరగాల్సి వస్తోంది. పెట్రోల్ కోసం వెళ్తే "డీజిల్ మాత్రమే ఉంది", డీజిల్ కోసం వెళ్తే "పెట్రోల్ మాత్రమే ఉంది" అనే బోర్డులు కనిపించడం వాహనదారులను విస్మయానికి గురిచేస్తోంది. మండుతున్న ఎండలో బంకుల చుట్టూ తిరుగుతూ, గంటల తరబడి క్యూల్లో వేచి ఉండలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

స్థానికుల ప్రకారం సరఫరా వ్యవస్థలో సమన్వయం లేకపోవడం, పౌరసరఫరాల శాఖ అధికారుల పర్యవేక్షణ లోపించడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని ఆరోపిస్తున్నారు.

### సమయం వృథా.. జనం బేజారు..

ఇంధన కొరత కారణంగా ముఖ్యంగా ఉద్యోగులు, విద్యార్థులు తమ గమ్యస్థానాలకు సకాలంలో చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పనులపై వెళ్లే వారు కూడా ఇంధనం కోసం అల్లాడాల్సి వస్తోంది. "ఒక బంకులో ఒకటే ఇంధనం ఉండటం వల్ల ప్రజల సమయం, డబ్బు రెండూ వృథా అవుతున్నాయి" అని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇంధన సరఫరా సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించి, అన్ని బంకుల్లో పెట్రోల్, డీజిల్ సమానంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని వలిగొండ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఫార్మా రంగంలో రాణించి.. ఉన్నత శిఖరాలకు చేరాలి

**- యూనిటీ కళాశాలలో 'ఫార్మా సంకల్ప్' సదస్సు**

**- ఫార్మా రంగంలో విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి**

**- జాతీయ సదస్సులో డాక్టర్ టీవీ నారాయణ**





తొలివెలుగు, యాదాద్రిభువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని రాయగిరిలో గల యూనిటీ ఫార్మసీ కళాశాలలో సోమవారం 'ఫార్మా సంకల్ప్'ను పురస్కరించుకుని జాతీయ స్థాయి సదస్సును ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ అంపటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి నేషనల్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ టీవీ నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో ఫార్మా రంగం కీలక పాత్ర పోషిస్తోందని, విద్యార్థులు తాజా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. యూనిటీ గ్రూప్ ఆఫ్ కాలేజెస్ చైర్మన్ ఏ. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఇలాంటి సదస్సులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో యూనిటీ గ్రూప్ ఆఫ్ కాలేజెస్ చైర్మన్ ఏ. ప్రభాకర్ రెడ్డి, వివిధ కళాశాలల చైర్మన్లు, ప్రిన్సిపల్స్, డైరెక్టర్లు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పెన్షన్లు మంజూరు చేయాలి.. ఇందిరమ్మ ఇళ్లలో పారదర్శకత పాటించాలి






**- వలిగొండ తహసీల్దార్ కార్యాలయం ముట్టడి**

**- రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై సీపీఎం ధ్వజం**

**తొలివెలుగు, వలిగొండ:** అర్హులైన ప్రతి ఒక్కరికీ నూతన పెన్షన్లు మంజూరు చేయాలని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో రాజకీయాలకు తావు లేకుండా పారదర్శకత పాటించాలని డిమాండ్ చేస్తూ సోమవారం వలిగొండ తహసీల్దార్ కార్యాలయాన్ని సీపీఎం శ్రేణులు ముట్టడించాయి. మండల కార్యదర్శి సిర్పంగి స్వామి అధ్యక్షతన జరిగిన ఈ నిరసనలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల వేళ 57 ఏళ్లు నిండిన వారికి, వితంతువులకు రూ. 4000, వికలాంగులకు రూ. 6000 పెన్షన్ ఇస్తామని నమ్మబలికిన ప్రభుత్వం, అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా ఆ దిశగా అడుగులు వేయడం లేదని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లను కేవలం గ్రామ సభల ద్వారానే గుర్తించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్, ఎంపీడీఓలకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పిఎన్ఎం జిల్లా కార్యదర్శి ఈర్లపల్లి ముత్యాలు, సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు కందడి సత్తిరెడ్డి, మండల కమిటీ సభ్యులు గాజుల ఆంజనేయులు, కల్కూరి రామచందర్, చీర్క శ్రీశైలం రెడ్డి, దుబ్బ లింగం, కవిడే సురేష్, రాధారపు మల్లేశం, మారబోయిన నరసింహ, వడ్డేమాన్ మారబోయిన ముత్యాలు, వరికుప్పల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు మద్దతు ధర కల్పించడమే లక్ష్యం



**- నాలుగు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం**

**- ఏర్పాట్లను పర్యవేక్షించిన మార్కెట్ కమిటీ చైర్మన్ బీమా నాయక్**



**తొలివెలుగు, వలిగొండ:** వలిగొండ మండలంలోని రైతులు తాము పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకే విక్రయించుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య బీమా నాయక్ సూచించారు. సోమవారం మండలంలోని గోకారం, జాలు కాలువ, నెమలి కాలువ, వెలువర్తి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం క్వింటా ధాన్యానికి రూ. 2,389 (గ్రేడ్–ఏ), రూ. 2,269 (గ్రేడ్–బి) వరకు మద్దతు ధర కల్పిస్తోందని తెలిపారు. కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, పాశం సత్తిరెడ్డి, సర్పంచులు నూతి ఇందిర రమేష్, మద్దెల మంజుల సందీప్, బందెల సునీత యాదయ్య, చెముడాల అనిత నర్సింగ్ యాదవ్, ఏపీఎం అంజయ్య, సీసీ రవీందర్, సంఘబంధం అధ్యక్షురాలు చెరుకు తిరుపతమ్మ, కొమ్ము ప్రేమలత, మేడగోని మారమ్మ, కొమ్ములింగమ్మ, మామిడి సంతోష, ఫాతిమా, చంద్రకళ, లింగమ్మ, చంద్రమ్మ, మారబోయిన అంజమ్మ, ఇక్కుర్తి ఎల్లమ్మ, రూప, చిత్రగుంట లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చౌటుప్పల్ పదో వార్డు కాంగ్రెస్ కమిటీ ఖరారు

**- అధ్యక్షుడిగా పోలోజు శ్రీనివాస చారి ఎన్నిక**

**- కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక - శ్రేణుల్లో ఉత్సాహం నింపిన ఎన్నికల ప్రక్రియ**





**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ 10వ వార్డు కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సుర్వి నరసింహ గౌడ్, స్థానిక కౌన్సిలర్ దేప రమ్యరాజు, మాజీ కౌన్సిలర్ బొడిగె అరుణ బాలకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. వార్డు అధ్యక్షుడిగా పోలోజు శ్రీనివాస చారి, ఉపాధ్యక్షుడిగా కానుగు మధు, ప్రధాన కార్యదర్శిగా దేప నరేష్ ఎన్నికయ్యారు. కోశాధికారిగా కైరంకొండ శ్రీనివాసులు, సహాయ కార్యదర్శిగా ఎండీ ఖదీర్, ప్రచార కార్యదర్శిగా ఎండీ అజం బాధ్యతలు చేపట్టారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఈ సందర్భంగా నేతలు కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ చౌటుప్పల్ మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ చాంద్ పాషా, ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతల మహేందర్, గోశిక నరసింహ, ఎరుకల సాయి, మాజీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
# తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

# భువీలో స్వింగ్ వేడి ఇంకా తగ్గలే.. 3/5తో స్వింగ్ కింగ్ ఈజ్ బ్యాక్!

**14 వికెట్లతో పర్పుల్ క్యాప్ అందుకున్న స్వింగ్ కింగ్**

**ఢిల్లీ క్యాపిటల్స్‌పై స్వింగ్‌తో భువీ సత్తా**

**పవర్ ప్లేలో 5 పరుగులే ఇచ్చిన భువనేశ్వర్**

భువనేశ్వర్ కుమార్ కెరీర్ ఆరంభంలో ఎలాంటి బౌలింగ్ చేశాడో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ స్వింగ్‌ను మరిపించాడు. రెండో బంతికే వికెట్ పడగొట్టిన భువీ ఢిల్లీ పతనాన్ని శాసించాడు. పవర్ ప్లేలో మూడు ఓవర్లు బౌలింగ్ చేసి కేవలం 5 పరుగులే ఇచ్చి మూడు వికెట్లు తీసుకున్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 14 వికెట్లు పడగొట్టిన భువనేశ్వర్ పర్పుల్ క్యాప్ అందుకున్నాడు.

టీమిండియా వెటరన్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌లో స్వింగ్ వేడి ఇంకా తగ్గలేదు. కెరీర్ ఆరంభంలో ఎలా అయితే బంతి తిరిగిందో.. ఢిల్లీ క్యాపిటల్స్ మీద కూడా సరిగ్గా అంతే బౌలింగ్ చేసి ప్రత్యర్థి జట్టును చిత్తు చేశాడు. గాల్లోనే స్వింగ్ అవుతూ వచ్చిన భువీ బంతికి ఢిల్లీ ప్లేయర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు. వరల్డ్ బెస్ట్ స్వింగ్ బౌలర్ అంటే ఏంటో ఐపీఎల్‌కు మరోసారి రుచి చూయించాడు.ఐపీఎల్ 2026లో భాగంగా అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు చరిత్రలో నిలిచిపోయే మ్యాచ్ ఆడింది. ఢిల్లీ



క్యాపిటల్స్‌ను కేవలం 75 పరుగులకే ఆలౌట్ చేసిన ఆర్సీబీ .. ఆ స్కోర్‌ను కేవలం 6.3 ఓవర్లలోనే ఛేదించింది. కేవలం ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 9 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందుకుంది.

ఈ మ్యాచ్‌లో భువనేశ్వర్ కుమార్ తన స్వింగ్ యార్కర్లతో మరోసారి కెరీర్‌లో బెస్ట్ పర్ఫార్మెన్స్ చేశాడు. ఇన్నింగ్స్ రెండో బంతికే వికెట్ తీసిన భువీ అందర్నీ ఆశ్చర్యపరిచాడు. యువ ఆటగాడు సాహిల్ పరాఖ్.. భువీ స్వింగ్‌కు భయపడ్డాడు. లెగ్ వికెట్ మీద పడిన యార్కర్ మిడ్ వికెట్లను తాకడంతో బెయిల్స్ ఎగిరిపోయాయి. భువీ వేసిన ఈ స్వింగ్ యార్కర్ అతని కెరీర్‌లోనే బెస్ట్‌గా నిలిచింది.

ఇక మూడు ఓవర్లు బౌలింగ్ చేసిన భువనేశ్వర్ కుమార్ కేవలం ఐదు పరుగులు మాత్రమే ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. సాహిల్ పరాఖ్‌తో పాటు డేంజరస్ ట్రిస్టన్ స్టబ్స్, కెప్టెన్ అక్షర్ పటేల్‌ను అవుట్ చేశాడు. పవర్ ప్లే లోనే మూడు ఓవర్లు వేసి మూడు వికెట్లు తీసుకున్నాడు. భువనేశ్వర్‌తో పాటు జోష్ హేజిల్‌వుడ్ కూడా పవర్ ప్లేలోనే మూడు వికెట్లు పడగొట్టడం విశేషం. ఈ మ్యాచ్‌లో హేజిల్‌వుడ్ 3.3 ఓవర్లు బౌలింగ్ చేసి 12 పరుగులు మాత్రమే ఇచ్చి నాలుగు వికెట్లు పడగొట్టాడు. ఎక్కువ వికెట్లు తీసిన హేజిల్‌వుడ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఇక ఓవరాల్‌గా 14 వికెట్లతో భువనేశ్వర్ కుమార్ పర్పుల్ క్యాప్ అందుకున్నాడు.

# ఢిల్లీ కోటలో ఆర్సీబీ జెండా.. 6.3 ఓవర్లలోనే టార్గెట్‌ను ఊదేసిన బెంగళూరు

**76 పరుగుల లక్ష్యాన్ని సులభంగా ఛేదించిన ఆర్సీబీ**

**విన్నింగ్ షాట్‌తో మ్యాచ్‌ని ఫినిష్ చేసిన కోహ్లి**

**బెంగళూరులో ఓటమికి రివేంజ్ తీర్చుకున్న ఆర్సీబీ**

ఢిల్లీ క్యాపిటల్స్‌పై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఘన విజయం సాధించింది. అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌లో ఫుల్ డామినేషన్ ప్రదర్శించింది. టాస్ గెలిచిన ఆర్సీబీ జట్టు ఢిల్లీ క్యాపిటల్స్‌ను కేవలం 75 పరుగులకే ఆలౌట్ చేసింది. 76 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆర్సీబీ 6.3 ఓవర్లలోనే ఛేదించి ఘన విజయాన్ని అందుకుంది. విరాట్ కోహ్లి విన్నింగ్ షాట్ కొట్టడంతో ఫ్యాన్స్ ఆనందంలో మునిగిపోయారు.

డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ 2026లో తన హవా కొనసాగిస్తోంది. విరాట్ కోహ్లి సొంతగడ్డ మీద ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. బౌలింగ్, బ్యాటింగ్‌లో డామినేషన్ ప్రదర్శించిన ఆర్సీబీ ఢిల్లీ క్యాపిటల్స్ అందించిన లక్ష్యాన్ని పవర్ ప్లే లోపే ఛేదించి రికార్డు క్రియేట్ చేసింది. బెంగళూరు వేదికగా దక్కిన ఓటమికి ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ రివేంజ్ తీర్చుకుంది.

అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బౌలర్లు, బ్యాటర్లు పూర్తి ఆధిపత్యం ప్రదర్శించారు. టాస్ గెలిచిన ఆర్సీబీ బౌలింగ్ ఎంచుకుని ఢిల్లీని చిత్తు చిత్తు చేసింది. జోష్ హేజిల్‌వుడ్, భువనేశ్వర్ కుమార్ రెచ్చిపోయి బౌలింగ్ చేయడంతో ఢిల్లీ క్యాపిటల్స్ కేవలం 75 పరుగులకే ఆలౌట్ అయింది.

ఈజీ టార్గెట్‌తో బరిలోకి దిగిన రాయల్ ఛాలెంజర్స్



బెంగళూరు జట్టు కేవలం 6.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. ఒకానొక దశలో పవర్ ప్లే లోపే ఆర్సీబీ మ్యాచ్ని ముగిస్తుంది అని అనుకున్నారు. కానీ.. మరో మూడు బంతులు అదనంగా తీసుకుని ఆర్సీబీ ఘన విజయం సాధించింది. కేవలం ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయిన ఆర్సీబీకి విరాట్ కోహ్లి విన్నింగ్ షాట్ కొట్టి విజయాన్ని అందించాడు.

కైల్ జెమీసన్ వేసిన తొలి ఓవర్‌లో కేవలం 7 పరుగులు మాత్రమే వచ్చాయి. రెండో ఓవర్‌లో కూడా ఆరు పరుగులే రావడంతో తొలి రెండు ఓవర్లలో ఆర్సీబీ 13 పరుగులు మాత్రమే చేసింది. కానీ.. మూడో ఓవర్ నుంచి రెచ్చిపోయి బ్యాటింగ్ చేశారు. జెమీసన్ ఓవర్‌లో బెతెల్ వరుసగా రెండు సిక్సర్లు కొట్టి అవుటయ్యాడు. బెతెల్ అవుటయ్యే సమయానికి



ఆర్సీబీ 27/1గా ఉంది.

దేవదత్ పడిక్కల్ ఎప్పుడైతే క్రీజులోకి వచ్చాడు అప్పటి నుంచి బౌండరీల మోత మొదలైంది. నాలుగో ఓవర్‌లో 12 పరుగులు రాగా.. ఐదో ఓవర్‌లో 21 పరుగులు రాబట్టారు. పవర్ ప్లే చివరి ఓవర్‌లో కేవలం 5 పరుగులే రావడంతో విజయం కోసం ఏడో ఓవర్ వరకూ ఆగాల్సి వచ్చింది. నటరాజన్ వేసిన ఏడో ఓవర్‌లో విరాట్ కోహ్లి వరుసగా రెండు సిక్సర్లు బాది మ్యాచ్‌ని ముగించాడు. 6.3 ఓవర్లలోనే కేవలం ఒక్క వికెట్ కోల్పోయి ఆర్సీబీ 77 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. జాకబ్ బెతెల్ 11 బంతుల్లో 20 పరుగులు చేయగా, విరాట్ కోహ్లి 15 బంతుల్లో 23, దేవదత్ పడిక్కల్ 13 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 34 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచారు.

# అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్' వివాదం.. అంగ్‌క్రిష్ రఘువంశీ ఔట్ వెనుక ఏం జరిగింది?

**ఐపీఎల్‌లో 'అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్' వివాదం**

**కేకేఆర్, లక్నో మ్యాచ్‌లో ఘటన**

**అంగ్‌క్రిష్ రఘువంశీని ఔట్ ఇచ్చిన అంపైర్**



ఐపీఎల్ 2026లో భాగంగా లక్నో సూపర్ జెయింట్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో అంగ్‌క్రిష్ రఘువంశీ 'అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్' కింద ఔట్ అవ్వడం తీవ్ర చర్చనీయాంశమైంది. కోల్‌కతా ఇన్నింగ్స్ 5వ ఓవర్‌లో ప్రిన్స్ యాదవ్ బౌలింగ్‌లో రఘువంశీ షాట్ ఆడి సింగిల్ కోసం ప్రయత్నించాడు. ఆపై వెనక్కి వచ్చే క్రమంలో షమీ వేసిన త్రో అతడికి తగిలింది. దీనిపై పంత్.. 'అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్' కింద అప్పీల్ చేశాడు. రిప్లేలను పరిశీలించిన థర్డ్ అంపైర్, బ్యాటర్ ఉద్దేశపూర్వకంగానే బంతిని అడ్డుకున్నాడని తేల్చి 'ఆర్టికల్ 37' ప్రకారం ఔట్‌గా ప్రకటించారు.

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026లో భాగంగా లక్నో సూపర్ జెయింట్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య మ్యాచ్‌లో వివాదాస్పద ఘటన చోటుచేసుకుంది. ఈ మ్యాచ్‌లో అంగ్‌క్రిష్ రఘువంశీ ' అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్ ' (ఫీల్డింగ్‌కు అంతరాయం కలిగించడం) వివాదం క్రికెట్ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. ఐపీఎల్ చరిత్రలో ఇలా ఔటైన నాలుగో ఆటగాడిగా అతడు నిలిచాడు.

## అసలేం జరిగిందంటే..

కోల్‌కతా నైట్ రైడర్స్ ఇన్నింగ్స్ 5వ ఓవర్‌ను ప్రిన్స్ యాదవ్ వేస్తున్నాడు. ఈ ఓవర్‌లో ఆఖరి బంతికి.. రఘువంశీ మిడ్ ఆన్ దిశగా షాట్ ఆడి సింగిల్ కోసం ప్రయత్నించాడు. అయితే అక్కడే ఫీల్డింగ్ చేస్తున్న మహమ్మద్ షమీ.. బంతిని వేగంగా అందుకున్నాడు. దీంతో రఘువంశీ.. క్రీజు దాటి సగం దూరం వెళ్లాక.. తిరిగి క్రీజులోకి వచ్చేందుకు ప్రయత్నించాడు. కానీ వెనక్కి వెళ్లే క్రమంలో షమీ విసిరిన బంతి.. రఘువంశీ కాలికి తగిలింది. దీంతో వికెట్ కీపర్ రిషభ్ పంత్ చేతికి బంతి వెళ్లలేదు.

అయితే రఘువంశీ.. కావాలనే తన దిశను మార్చుకుని వెనక్కి పరుగెత్తాడని రిషభ్ పంత్.. 'అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్' కింద ఫీల్డ్ అంపైర్‌కు అప్పీల్ చేశాడు. ఈ విషయాన్ని ఫీల్డ్ అంపైర్.. థర్డ్ అంపైర్‌కు రిఫర్ చేశాడు. చాలా సేపు రిప్లేలను పరిశీలించిన థర్డ్ అంపైర్.. రఘువంశీ ఉద్దేశపూర్వకంగానే బంతికి అడ్డుపడ్డాడని నిర్ధారించారు. ఆర్టికల్ 37 ప్రకారం రఘువంశీని ఔట్ అని ప్రకటించాడు. దీనిపై రఘువంశీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. అసహనం వ్యక్తం చేస్తూనే మైదానాన్ని వీడాడు. బ్యాట్, హెల్మెట్‌ను నేలకేసి కొట్టాడు.

ఇదే విషయంపై కోల్‌కతా నైట్ రైడర్స్ హెడ్ కోచ్ అభిషేక్ నాయర్, మెంటార్ షేన్ వాట్సన్ అసహనం వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరేమో రఘువంశీని సమర్థిస్తున్నారు. మరికొందరు అతడు కావాలనే బంతికి అడ్డువెళ్లాడని కామెంట్లు చేస్తున్నారు. గతంలో యూసుఫ్ పటాన్, అమిత్ మిశ్రా, రవీంద్ర జడేజాలు సైతం 'అబ్‌స్ట్రక్టింగ్ ద ఫీల్డ్' కింద ఔట్ అయ్యారు




## గ్రీన్ డ్రెస్‌లో మెరిసిన మమితా బైజు.. నవ్వుతోనే మాయ చేస్తున్న 'ప్రేమలు' బ్యూటీ..

**మలయాళ కుట్టి మమితా బైజు తన క్యూట్ లుక్స్‌తో సోషల్ మీడియాలో నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది. తాజాగా గ్రీన్ కలర్ ట్రెడిషనల్ డ్రెస్‌లో దిగిన ఫోటోలను షేర్ చేయగా, అవి నెట్టింట వైరల్ అవుతున్నాయి. తన చిరునవ్వుతో కుర్రకారును మాయ చేస్తోన్న ఈ 'ప్రేమలు' బ్యూటీ, త్వరలో ధనుష్‌తో కలిసి 'కర' సినిమాతో పలకరించనుంది.**

